


# నేటిధాత్రి®

తెలుగు వార్తా పత్రిక

22ND ANNIVERSARY

గురువారం 15-10-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 175 రూ॥ 6.00






# కుట్ర దారుల కలలు నెరవేరవు

# అబద్దాలు ఎప్పుడూ నిజం కావు!




చీఫ్ ఎడిటర్

కట్టా రాఘవేందర్ రావ్

9063524136, 9908658888


## కుట్రదారులు విశ్వ ప్రయత్నాలు చేసినా కేటీఆర్, హరీష్‌లను దూరం చేయలేరు!




- ఇద్దరూ ఇద్దరే.. ఆ ఇద్దరూ ఒక్కటే!
- కల్మషం లేని మనసులు..కుట్రలకు తావులేదు!
- ఆధిపత్య పోరుకు ఆస్కారం అసలే లేదు!
- నిందలు నిజం కాదు.. కుట్రలు గెలిచేది లేదు!
- ఆ భారతంలో కృష్ణార్జునులు ఆదర్శనీయులు!
- ఈ బీఆర్ఎస్ లో కృష్ణార్జునులు పార్టీకి రెండు కళ్ళు!
- హరీష్ మీద నిందలు కేటీఆర్ అసలే నమ్మడు!
- కేసీఆర్ అసత్య ప్రచారాలు అసలే పట్టించు కోరు!
- హరీష్ బలాన్ని బలహీనం చేయలేరు.
- కేటీఆర్ మనో ధైర్యం దెబ్బ తీయలేరు!
- ఇద్దరి మనస్సులో విష బీజాలు నాటలేరు!
- బీఆర్ఎస్ ను అస్థిర పరచలేరు!
- గులాబీ వనంలో చీడకు అవకాశామే లేదు.
- కుట్ర దారుల కలలు నెరవేరవు!
- శిఖండి రాజకీయాలు తెలంగాణ లో సాగవు.










- జనాన్ని మెప్పించే నైతికత కుట్రలు చేసే వారికి లేదు!
- హరీష్ మీద పోరాటం చేసే శక్తి ప్రత్యర్థులకు లేదు.
- హరీష్ అంకిత భావం శంకించలేరు!
- ఎన్ని ప్రయత్నాలు చేసినా కృష్ణార్జునుల విడదీయలేరు!
- ఇద్దరి మధ్య అంతరం అసాధ్యం
- ఆ బంధం ఉద్యమ సొంతం..
- అటు పేగు బంధం..ఇటు వాత్సల్యం!
- ఇద్దరికీ వున్నది ఉద్యమ పోరు బంధం!
- ఇద్దరూ పార్టీకి అష్ట దిక్పాలకులు.
- గుడిలాంటి బీఆర్ఎస్ కు ఒకరు ధ్వజస్తంభం.. మరొకరు గాలిగోపురం!
- రెండింటినీ విడదీసి చూడడం అసంభవం!
- బురద రాజకీయం చేసే వారికి పంది పోర్లాడటమే తెలుసు!
- తల్లి పాలు తాగి రొమ్ము గుద్దే వాళ్ళ గురించి ప్రజలకు తెలుసు.
- అవకావాదులు హరీష్ రావును నిందిస్తూనే వుంటారు.

## శిఖండి చేష్టలు తెలంగాణ ప్రజలే మెచ్చరు!

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

**హైదరాబాద్, నేటిధాత్రి:**

కందకు లేని దురద కత్తిపీటకు ఎందుకు? అని సామెత. సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమ కారుడు హరీష్‌రావు మీద కుట్రలు కొత్తకాదు. ఆయనను పార్టీకి దూరం చేయాలని చూడడం ఇప్పుడేం కొత్త కాదు. హరీష్‌రావును బిఆర్‌ఎస్‌కు దూరం చేస్తే కేసిఆర్ కుడి భుజం తీసేనట్లే అని ఆశపడిన వారు ఇప్పుడే కాదు, ఉద్యమ కాలం నుంచి వున్నారు. ఏకంగా తెలంగాణ ఉద్యమాన్నే లేకుండా చేయాలంటే హరీష్‌రా వు మీద బురద జల్లిన రోజులు అనేకం వున్నాయి. అప్పుడు కేసిఆర్‌కు దూరం చేయాలని చూసిన వారి ఆశలు నెరవేరలేదు. హరీష్‌రావు మీద అనేక అనుమాలు వచ్చేలా అనేక కుట్రలు చేశారు. ఇప్పుడు కేటిఆర్‌కు హరీష్‌రావును దూరం చేయాలని అనేక మంది చూస్తున్నారు. అందులో ఐన వారున్నారు. కాని వారున్నారు. ప్రత్యర్థి పార్టీలో వున్న వారున్నారు?కోవర్టులున్నారు. కొంచెపు తనం వున్న వారున్నారు. ఇవి ఎప్పుడూ వుండేవే..ఎదురుగా వచ్చి యుద్దం చేయలేని వారు చేసే పన్నాగాలు కొత్త కాదు. అయితే ఏకంగా హరీష్‌రావు మీద కేసిఆర్ కోపంగా వున్నట్లు ఫేక్ షోకాజ్‌నోటీస్ విడుదల చేసేదాకా వచ్చారు. అలాంటి లెటర్ విడుదలైతే ఎవరి మీద అనుమానం వస్తుందో చేసిన వారికి తెలుసు. తెలిసి తెలిసి తప్పులు చేస్తున్నారు. హరీష్‌రావును పార్టీకి దూరం చేయాలని కలలు కంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యమం తారా స్థాయిలో జరుగుతున్న సమయంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేశారు. ఉప ఎన్నికలు ఎదుర్కొన్నారు. మళ్లీ గెలిచారు. ఆ సమయంలో హరీష్‌రావు సిఎం. వైఎస్ అప్పాయింటు మెంటు వుండడం, సిద్దిపేటలో మహిళా డిగ్రీ కాలేజీ మంజూరు చర్చకు వెళ్లడం జరిగింది. దానిని పెద్ద రాద్దాంతం చేశారు. హరీష్‌రావు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం చేశారు. ఆఖరుకు హరీష్‌రావు కంట తడి పెట్టుకునేలా చేశారు. అదే సమయంలో హరీష్‌రావును కేసిఆర్ తిట్టినట్లు ప్రచారం సాగించారు. హరీష్ రావు అంటేనే నమ్మకం. హరీష్‌రావు అంటేనే కేసిఆర్‌కు కొండంత బలం. పదవుల కోసం ఆశపడే నాయకుడు హరీష్‌రావు కాదు. ఎమ్మెల్యే కాకుండానే కేసిఆర్ వల్ల హరీష్ రావు మంత్రి అయ్యారు. అంతకంటే అవకాశం మరెవ్వరికీ దక్కదు. అయినా బిఆర్‌ఎస్ అనే గులాబి మొక్కను కేసిఆర్ నాటారు. దానికి నిత్యం నీరు పోసి, పెద్ద చేసి గులాబి వనం తయారు చేయడంలో హరీష్ పాత్ర పెద్దది. పార్టీ కోసం ఆయన ఎంత కష్టపడాలో అంత కష్టపడుతుంటారు. ఉద్యమ కాలంలో ఒంటి చేత్తే పార్టీని గెలిపించే బాద్యతలు చేపట్టే వారు. అవి ఉప ఎన్నికలైనా, స్థానిక సంస్థల ఎన్నికలైనా, ఆర్టీసి ఎన్నికలైనా, సింగరేణి ఎన్నికలైనా సరే అన్నింటికీ ముందుండి గెలిపించిన నాయకుడు హరీష్‌రావు. అలాంటి నాయకుడిని కేసిఆర్ దూరం పెట్టాలని అనేక కుట్రలు ఆనాటి నుంచే చేస్తూ వస్తున్నారు. కేసిఆర్‌ను బలహీనుడిని చేయాలంటే హరీష్‌ను పక్కకు జరపాలని అనేక మంది ప్రయత్నాలు చేశారు. అది ఎప్పటికీ సాద్యం కాదన్న సంగతి తెలిసినా ఇంకా కుయుక్తులు పన్నుతూనే వున్నారు. పార్టీ కష్టకాలంలో వున్నప్పుడు పట్టుకొని వుండే నాయకుడిపై నిందలు వేయడం అంటేనే ఆకాశం మీద ఉమ్మేసినట్లు? అయినా కుట్రలు చేస్తూనే వున్నారు. అందులోనూ హరీష్‌ను ఎదరించడం సాధ్యం కాదు? హరీష్‌ను ఓడి ంచడం అంతకన్నా సాధ్యం కాదు. హరీష్‌ను మించి నాయకుడిగా ఎదగలేని వాళ్లు, అసలు బిఆర్‌ఎస్‌పార్టీయే వుండొద్దనుకునే వారు ఈ మధ్య ఎక్కువైపోయారు. ఒకప్పుడు కేసిఆర్‌ను వీక్ చేయాలంటే హరీష్‌ను దూరం చేయాలనుకున్నారు. ఇప్పుడు కేటిఆర్‌ను ఒంటరి చేయాలంటే హరీష్ మీద నిందలు వేయాలనుకుంటున్నారు. అంతిమంతా కేటిఆర్, కేసిఆర్ మధ్య దూరం పెంచాలనుకుంటున్నారు. హరీష్ రావు మీద లేని పోని నిందలు వేస్తే కేటిఆర్ నమ్ముతాడని భ్రమ పడుతున్నారు. హరీష్‌రావు అంటే ఏమిటో ఆయన నాయకత్వం ఎంత బలమైందో తెలియనంత అమాయకుడు కేటిఆర్ కాదు. కేటిఆర్ క్లాస్ లీడర్. హరీష్‌రావు మాస్ లీడర్. ఇద్దరూ కలిస్తేనే బిఆర్‌ఎస్. ఈ సంగతి ఆ ఇద్దరికీ తెలుసు. ఆ ఇద్దరూ ఒకటే అని ఇద్దరికీ తెలుసు. ఆ ఇద్దరిని ఇప్పుడు దూరం కావాలని చూసే వాళ్లకు కూడా తెలుసు. అయినా ప్రయత్నం ఆపడం మానుకోవడం లేదు. హరీష్‌రావు మీద అవినీతి ఆరోపణలు చేశారు. అవి నిరూపించలేకపోయారు. పార్టీకి హరీష్‌రావు నష్టం చేస్తున్నారని నిందలు వేశారు. వాటిని నిరూపించలేకపోయారు. ప్రాణమున్నంత వరకు తాను బిఆర్‌ఎస్‌కు సైనికుడినే అని హరీష్‌రావు కొన్ని వేల సార్లు చెప్పారు. ఈ జీవితానికి కేసిఆర్ మా నాయకుడు. కేసిఆర్ కోసమే తన రాజకీయం అని అనేక సార్లు నిరూపించారు. తెలంగాణ ఉద్యమం కోసమే తెలంగాణ సాధన కోసమే ఉద్యమ రాజకీయ బాటలో అడుగులు వేసిన నాయకుడు హరీష్‌రావు. కేసిఆర్ తో ఆశయాలను ఆచరించిన నాయకుడు హరీష్‌రావు. కేటిఆర్‌కూడా తెలంగాణ కోసమే వచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకున్నారు. తెలంగాణకోసం అలు పెరగని పోరాటం చేశారు. కేసిఆర్ ఆదేశాలను ఆది నుంచి ఆచరిస్తున్నవాళ్లే. అయినా ఇద్దరి మధ్య దూరం పెంచాలని అనేక సార్లు ప్రయత్నం చేశారు. గతంలో కేటిఆర్‌ను సిఎం. చేస్తారనుకున్నప్పుడే హరీష్‌రావు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కేటిఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటును చేసినప్పుడు స్వాగతించారు. హరీష్‌రావుకు తనేంటో తెలుసు. తన పరిమితులు ఏమిటో తెలుసు. అంతే తప్ప ఏనాడు పదవుల మీద ఆశలు పెంచుకున్నది లేదు. పదవులు కావాలని ఆశపడింది లేదు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఆయనను ప్రలోభ పెట్టాలని చూశారు. తెలంగాణ కోసం అన్నీ ఆనాటి నుంచి త్యాగం చేసుకుంటూనే వస్తున్నారు. తాజాగా సిద్దిపేట జిల్లా ఏర్పడి దశాబ్ద కాలం పూర్తయిన సందర్భంగా జరిగిన వేడుకల్లో హరీష్‌రావు అనేక సార్లు కేటిఆర్‌ను గుర్తు చేసుకున్నారు. సిద్దిపేట అభివృద్ది కోసం అడిగిన వెంటనే కేటిఆర్ నిధులు ఎలా ఇచ్చారో చెప్పుకొచ్చారు. ఒకప్పుడు సిద్దిపేట అంటే సందులు వందులు అని చెప్పుకునేవారు. సిద్దిపేట నడి బొడ్డులో పందులు ఒక మనిషి మీద దాడి చేసి పీక్కు తిన్న సంఘటనలు గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సిద్దిపేట అభివృద్దికోసం ఆనాడు పాలకులు సహకరించలేదు. కాని తెలంగాణ వచ్చిన వెంటనే మున్సిపల్ శాఖ మంత్రిగా వున్న కేటిఆర్‌ను సిద్దిపేటకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం నిధులు కావాలని కోరిన వెంటనే అంగీకరించారు. నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు. ఒకప్పుడు చిన్న సందుల్లో పెద్ద పెద్ద మోరీలతో సైకిళ్లు కూడా వెళ్లలేని ఇరుకులు ఇప్పుడు లేవు. రోడ్డు కిరువైపులా వుండే మోరీలు మూసేసి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటుచే యడం వల్ల రోడ్లు వెడల్పయ్యాయి. కనీసం సైకిళ్లు కూడా వెళ్లలేని సందుల్లో ఇప్పుడు ఆటోలు కార్లు కూడా తిరుగుతున్నాయి. అందుకు కేటిఆర్‌కు హరీష్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో ఐటి విప్లవం తెచ్చిన పాలకుడు కేటిఆర్ అని హరీష్ కొనియాడారు. తెలంగాణలో హైదరాబాద్‌తోపాటు ఉమ్మడిజిల్లా కేంద్రాలకు ఐటి టవర్స్ ఏర్పాటు చేశారు. సిద్దిపేటకు ఐటి టవర్ కావాలని కోరినవెంటనే కేటిఆర్ అనుమతులు మంజూరు చేశారని గుర్తు చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మాటలు విన్న కుట్ర దారులు క కుళ్లుకున్నట్లున్నారు. కృష్ణార్జులను ఎంత దూరం చేయాలని చూస్తున్నా, ఇద్దరూ మరింత దగ్గరవుతున్నారని కళ్లలో నిప్పులు పోసుకున్నట్లున్నారు. కేటిఆర్‌ను పొగడం ఇష్టంలేని కుట్ర దారులు ఇద్దరి మధ్య పచ్చ గడ్డి వేసి పగలు పెంచాలనుకుంటున్నారు. ఏకంగా ఫేక్ లెటర్ సృష్టించి హరీష్‌రావుపై కేసిఆర్ కన్నెర్ర చేశారిన అభూత కల్పనను సృష్టించాలనుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటు కేటిఆర్‌కు సిద్దిపేట ప్రత్యేక వర్గమంటూ అవసరం లేదు. అయితే సిరిసిల్ల జిల్లా మొదట ఏర్పాటు జరగలేదు. ఆ జిల్లా సంబరాలకు ఇంకా సమయం వుంది. తెలంగాణలో ఈ నెల 10, 11తేదీలలో కొత్తగా తొలివిడతలో కొత్తగా ఏర్పాటైన జిల్లాల పదేళ్ల పండుగలు నిర్వహించారు. అయితే సిద్దిపేట జిల్లా దశాబ్ది ఉత్సావాలు నభూతో నభిష్యతి అన్నట్లు హరీష్‌రావు నిర్వహించారు. హరీష్‌రావు కీర్తిని మసకబార్చాలని కుట్రలు చేస్తున్న వారికి ఇది కంటకింపుగా మారింది. ఏదో ఒకటి చేసి, హరీష్‌రావును తక్కువ చేసేందుకు ఫేక్ లెటర్ క్రియేట్‌చేశారు. డైవర్ట్ పాలిటిక్స్ చేయాలని చూశారు. కాని కథ అడ్డం తిరిగింది. ఎంత ప్రయత్నం చేసినా, ఎన్ని సార్లు కుట్రలు పన్నినా హరీష్‌రావును తక్కువ చేయలేమని తెలిసినా గజినీ దండయాత్రలు చేస్తూనే వున్నారు. అపోహలు సృష్టించాలని చూస్తూనే వున్నారు. కాని వారి కలలు నెరవేరవు. కేటిఆర్ , హరీష్‌రావు ల మధ్య అపోహలు సృష్టించలేరు. శిఖండి రాజకీయాలు తెలంగాణలో సాగవు. బిఆర్‌ఎస్ పునాదులు కదిలించలేరు.



22ND ANNIVERSARY

# నేటిధాత్రి

తెలుగు వార్త పత్రిక



గురువారం 15-10-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 175 రూ॥ 6.00


## 2047 వికసిత్ భారత్‌కు రాష్ట్రాల

# సహకారం కీలకం!

### 2034 నాటికి తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ



- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- మహిళలు, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం.. పెట్టుబడులకు ప్రభుత్వ భరోసా



హైదరాబాద్, నేటిధాత్రి:
2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్రాల సహకారం అవసరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాలని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యానికి రాష్ట్రాల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026ను ప్రారంభించిన సీఎం ప్రసంగించారు.

**మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ**

తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (సీయూఆర్‌ఈ)గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఐటీ, సేవారంగం, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (పీయూఆర్‌ఈ)గా తీర్చిదిద్ది తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, రవాణా అనుసంధాన రంగాలను ప్రోత్సహిస్తామని వెల్లడించారు. మిగిలిన గ్రామీణ ప్రాంతాలను రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (ఆర్‌ఏఆర్‌ఈ)గా అభివృద్ధి చేసి వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రామీణ ఉపాధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

**దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి పెంచుతాం**

ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటా ఐదు శాతంగా ఉందని, దాన్ని పది శాతానికి పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. నాలుగు వందల ఏళ్ల క్రితమే చార్మినార్ హైదరాబాద్‌కు గుర్తింపుగా నిలిచిందని, ఆధునిక వ్యాపార రంగంలో హైటెక్ సిటీ మరో ముఖ్యమైన గుర్తింపుగా మారిందని చెప్పారు. నూతన పారిశ్రామిక విధానంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

**మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం**

మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలే ఆర్థికంగా బలపడుతున్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో మహిళలకు రూ.61 వేల కోట్ల బ్యాంకు అనుసంధాన రుణాలు అందించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సౌర విద్యుత్ కేంద్రాల నిర్వహణలో మహిళలను భాగస్వాములను చేస్తున్నామని చెప్పారు. యువతతోపాటు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సూచించారు. ఇందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మంచి విధానాలను కొనసాగిస్తూ పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యంతో అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి కె.రఘురామ కృష్ణరాజు, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాస రావు, దానం నాగేందర్, మున్నూరు కాపు ఫౌండేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జస్టిస్ భవానీ ప్రసాద్, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశ్ తదితరులు హాజరయ్యారు. రెండు రోజులపాటు సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026 జరగనుంది.

# ఆస్తుల జప్తు



## టీటీడీ కల్తీ నెయ్యి కేసులో కీలక మలుపు!

### ●రూ.130 కోట్ల ఆస్తులను జప్తు చేసిన ఈడీ

- రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడి
- ఫ్రంట్ డెయిరీల ద్వారా టెండర్లలో పాల్గొన్నట్లు గుర్తింపు
- నకిలీ కొనుగోళ్లు, అమ్మకాలతో లావాదేవీలకు అసలు రూపం
- బ్యాంకు చెల్లింపుల అనంతరం హవాలా మార్గంలో నగదు మళ్లించినట్లు అనుమానం

06 లో

## ఇమామ్‌లు, మౌజన్లకు రూ.22.45 కోట్ల

# గౌరవ వేతనం విడుదల

- 9,982 మందికి మూడు నెలల చెల్లింపులు
- ఇప్పటివరకు రూ.202 కోట్లు పంపిణీ

అమరావతి, నేటిధాత్రి:
ఆంధ్రప్రదేశ్‌లోని మసీదుల్లో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల గౌరవ వేతనాన్ని విడుదల చేసింది. మొత్తం 9,982 మందికి రూ.22.45 కోట్లను విడుదల చేసినట్లు ప్రకటించింది. వీరిలో 4,991 మంది

06 లో

# గద్వాలలో హరీశ్ రావు 'రైతు గర్జన'!

### రైతు కరెంటు కట్.. విద్యార్థులకు పురుగుల అన్నం!



- దళితుల భూములపైనా సర్కారు కన్ను!
- గద్వాల పర్యటనలో ప్రభుత్వాన్ని నిలదీసిన హరీశ్ రావు
- లాగ్‌బుక్ పరిశీలనలో 7 గంటల 50 నిమిషాల విద్యుత్ సరఫరా
- ఇందువాసి ప్రమాద బాధిత కుటుంబాలకు పరామర్శ.. బీఆర్ఎస్ తరఫున ఆర్థిక సాయం
- సబ్జెక్టు ఉపాధ్యాయులు లేరు.. వసతులు లేవంటూ విద్యార్థుల ఆవేదన
- రాయపురంలో 110 ఎకరాల అసైన్డ్ భూముల వివాదం.. రైతులకు అండగా ఉంటామని హామీ

గద్వాల, నేటిధాత్రి:
జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు పర్యటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రైతులకు విద్యుత్ సరఫరాలో కోతలు, ఎండిపోతున్న పంటలు, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత, ఉపాధ్యాయుల కొరత, పేద దళిత రైతుల భూముల సమస్యలను ఆయన ప్రస్తావించారు. గట్టు విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి లాగ్‌బుక్ పరిశీలించగా, ఇందువాసిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వలసకూలీల కుటుంబాలను పరామర్శించారు. పాఠశాల విద్యార్థుల సమస్యలను విన్నారు. రాయపురం రైతుల భూముల పోరాటానికి మద్దతు ప్రకటించారు.

**లాగ్‌బుక్‌లో 7.50 గంటలే!**

గట్టు మండలంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని రైతులు ఫిర్యాదు చేయడంతో హరీశ్ రావు విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారిక లాగ్‌బుక్‌ను పరిశీలించి, అక్టోబరు 13న రైతులకు అందించిన త్రీఫేస్ విద్యుత్ సరఫరా వివరాలను వెల్లడించారు. ఆ రోజు మొత్తం 7 గంటల 50 నిమిషాలే విద్యుత్ సరఫరా జరిగిందని తెలిపారు. అందులోనూ మూడుసార్లు అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు.
ఒకసారి గంటపాటు, మరోసారి ఐదు నిమిషాలు, ఇంకోసారి పది నిమిషాలపాటు సరఫరా నిలిచిపోయిందని వివరించారు. రైతులకు కనీసం ఎనిమిది గంటల విద్యుత్ కూడా నిరంతరాయంగా అందించలేకపోతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఇచ్చే కొద్దిపాటి సమయంలోనూ పదేపదే కోతలు విధించడం వల్ల సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.

**చివరి మడికి అందని నీరు**

విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోవడంతో బోర్ల నుంచి నీరు సక్రమంగా పారడం లేదని, మొదటి మడులకే నీరు అందుతుండగా చివరి మడులకు నీరు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు హరీశ్ రావు తెలిపారు. ఫలితంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.
సబ్‌స్టేషన్ సిబ్బందిని లాగ్‌బుక్ వివరాలపై ప్రశ్నించగా,

08 లో



## స్థానిక సమరానికి

# టీడీపీ-జనసేన జట్టు!

### సీట్ల సర్దుబాటుపై కూటమి పార్టీల ఏకాభిప్రాయం

- 2024 ఎన్నికల తరహాలోనే కలిసి పోటీ
- బలమున్న చోట ఆయా పార్టీల అభ్యర్థులు
- రెండు రోజుల్లో జనసేన అభ్యర్థుల ప్రకటన
- సీట్ల లెక్కలు కాదు.. గెలుపే లక్ష్యం: ఎమ్మెల్యే బొలిశెట్టి

అమరావతి, నేటిధాత్రి:
ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు కొలిక్కి వచ్చినట్లు జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి వెల్లడించారు. 2024 ఎన్నికల్లో అనుసరించిన పొత్తు విధానంలోనే స్థానిక ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు తెలిపారు. కూటమి పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కార్యకర్తల మనోభావాలకు ప్రాధాన్యమిస్తూ అభ్యర్థుల ఎంపిక చేపడతామని పేర్కొన్నారు.

**గెలుపే లక్ష్యంగా పోటీ**

సీట్ల కేటాయింపులో శాతం, నిష్పత్తుల కంటే గెలుపు అవకాశాలకే ప్రాధాన్యమిస్తామని బొలిశెట్టి తెలిపారు. ఏ ప్రాంతంలో ఏ పార్టీకి బలం ఉందో అక్కడ ఆ పార్టీ పోటీ చేస్తుందని వివరించారు. కూటమి తరఫున ఉమ్మడి లక్ష్యంతో ఎన్నికలను ఎదుర్కొంటామని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జనసేన అభ్యర్థుల వివరాలను రెండు రోజుల్లో ప్రకటిస్తామని, పార్టీ ప్రాతిపదికన కాకుండా కూటమి తరఫున అభ్యర్థులను ప్రకటించే అంశంపై దృష్టి సారించినట్లు తెలిపారు.

**కేడర్‌కు ప్రాధాన్యం**

అనంతరం జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సూచించిన విధంగా కార్యకర్తలు సంతృప్తి చెందేలా స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పారు. ఎవరు ఎక్కడ పోటీ చేయాలనే అంశంపై కూటమి పార్టీలకు స్పష్టత ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం జనసేన కట్టుబడి ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఐక్యత, అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటు కీలకంగా మారనున్నాయి. అధికారిక అభ్యర్థుల ప్రకటనతో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల సమీకరణాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## రెండు లక్షల మందితో హైదరాబాద్‌లో మార్చ్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- దసరా తర్వాత భారీ బహిరంగ సభ: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



హైదరాబాద్, నేటిధాత్రి:
ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు వ్యతిరేకంగా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో దసరా తర్వాత హైదరాబాద్‌లో రెండు లక్షల మందితో మార్చ్, భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. దక్షిణాదిలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రెండు రాష్ట్రాల్లో సభలు నిర్వహించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించిందన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.
ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదని కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పట్టభద్రుల ఎన్నికల్లో విజయం కోసం కృషి చేస్తున్నామని, అక్టోబరు 23న సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం ఉంటుందని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. దసరా నాటికి కార్పొరేషన్ పదవులను భర్తీ చేస్తామని చెప్పారు.
ఎర్రవల్లిలో 45 ఎకరాల భూమి వ్యవహారంపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేపట్టనున్న సింగరేణి గర్జనకు అర్థం లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయ

# వివక్షకు తావులేదు!

- అధికార, ప్రతిపక్ష నియోజక వర్గాలనే తేడా లేదు.. అర్హతే ప్రామాణికం
- తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల మంజూరు
- బతుకమ్మ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింత లక్ష్యం: మంత్రి పొంగులేటి

మేడ్చల్, నేటిధాత్రి:
ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదని, అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అధికార పక్ష ఎమ్మెల్యే ఉన్నా, ప్రతిపక్ష ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమైనా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వివక్ష చూపడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పరిమిత ప్రాంతాలకే జరిగాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలను సమానంగా చూస్తోందని పేర్కొన్నారు.

**పేదలకు గౌరవప్రదమైన నివాసం**

హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు పలుకుతున్నప్పటికీ, నగరంలోనే ఉపాధి పొందుతున్న పేదలకు వారు నివసించే ప్రాంతాలకు దగ్గరగా గౌరవప్రదమైన నివాసాలు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. ఉపాధికి దూరంగా ఉండే ప్రాంతాలకు పేదలను తరలించే విధానానికి స్వస్తి పలుకుతున్నామని చెప్పారు. బుధవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.



**తొలి విడతలో లక్ష ఇళ్ల లక్ష్యం**

హైదరాబాద్ నగర ప్రాంత పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని పొంగులేటి వెల్లడించారు. 23 నియోజకవర్గాల్లో నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, ఇప్పటికే ఆరు ప్రాంతాల్లో ఇందిరమ్మ టవర్లకు శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శక బహిరంగ లాటరీ ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు.
ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఇప్పటికే సొంత ఇళ్లు ఉన్నవారిని గుర్తించి, అర్హతలను ధ్రువీకరించిన తర్వాతే లబ్ధిదారులను ఎంపిక చేశామని చెప్పారు. స్థానికంగా నివసించే అర్హులకే ఇళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.

**రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు**

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఇందిరమ్మ టవర్ల తదుపరి విడత కోసం త్వరలో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

**పూర్తి హక్కులతో ఇళ్ల రిజిస్ట్రేషన్**

ఇందిరమ్మ టవర్లలో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని మంత్రి స్పష్టం చేశారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని ప్రకటించారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్ పత్రాల్లో పొందుపరుస్తామని తెలిపారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడవద్దని, తదుపరి విడతల్లోనూ అర్హతల ఆధారంగా ఎంపిక చేస్తామని భరోసా ఇచ్చారు.

## యాసంగిలో వరి సాగు తగ్గే అవకాశం!

### పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు: తుమ్మల

హైదరాబాద్, నేటిధాత్రి:
రానున్న యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉన్నందున పశుగ్రాసం కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పంట వ్యర్థాలను పశుగ్రాసంగా వినియోగించాలని, అవసరమైతే ఖరీఫ్ పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాలని సూచించారు.

**70 లక్షల మంది రైతులకు మట్టి పోషకాల సమాచారం**

డిజిటల్ వ్యవసాయంలో కృత్రిమ మేధ, ఉపగ్రహ సాంకేతికతను వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. ఉపగ్రహ సమాచారం ఆధారంగా 70 లక్షల



మంది రైతులకు మట్టి పోషకాల వివరాలు అందించే యోచనలో ఉన్నట్లు చెప్పారు. అధిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంపై బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయిల్‌పామ్ సాగు, యాంత్రీకరణ, గోదాముల నిర్మాణాలపైనా చర్చించారు.

## బతుకమ్మ వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు



**▶▶సద్దుల బతుకమ్మ వేడుకలకు భారీ ఏర్పాట్లు...**

**▶▶ఏర్పాట్లను పర్యవేక్షించిన సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్...**

**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం గణపురం సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ సంతవద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, వేడుకలకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్దుల బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పంచాయతీ కార్యదర్శి ఉమ్మల్ల విజేందర్, వార్డు సభ్యులు గంధం ఓదాకర్, కొడపాక అనిల్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సదయ్య కుటుంబాన్నిగండ్ర పరామర్శ



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలం అప్పయ్యపల్లి మాజీ ఉప సర్పంచ్ పల్లెబోయిన సదయ్య మాతృమూర్తి కీ.శే కొమురమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా నేడు వారి ఇంటికి వెళ్ళి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి వెంట ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు మోతే కరుణాకర్ రెడ్డి సర్పంచ్ మద్దెల అశోక్ మాజీవ్యవసాయ మార్కెట్ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు మాజీ సొసైటీ చైర్మన్ పో రెడ్డి పూర్ణచందర్ రెడ్డి అశోక్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలోబతుకమ్మ వేడుకలు.



**చిట్యాల, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం రోజున మండల కేంద్రంలోని ప్రభుత్వ మహిళ ఉద్యోగులు ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు, తీరక్క పువ్వుతో పేర్చిన బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు ఆడి పాడి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయశ్రీ మాట్లాడుతూ ఆడపడుచులు అత్యంత ప్రతిష్టాత్మకంగా సంబరంగా నిర్వహించుకునే ఏకైక పండుగ బతుకమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉద్యోగులు తాసిల్దార్ కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై మెరుగు రాజుకు ఘన సత్కారం



**▶▶వర్ధన్నపేట నుంచి వంగర పోలీస్‌స్టేషన్‌కు బదిలీ..**

**వర్ధన్నపేట, నేటిధాత్రి:** వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో రెండున్నరేళ్ల పాటు ఎస్సైగా విధులు నిర్వహించి, హనుమకొండ జిల్లా వంగర పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న మెరుగు రాజును ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వర్ధన్నపేటలో విధులు నిర్వహించిన సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు విశేష కృషి చేశారని నాయకులు కొనియాడారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యల పరిష్కారానికి అందించిన సేవలు అభినందనీయమన్నారు. వంగర పోలీస్‌స్టేషన్‌లోనూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, యువజన అధ్యక్షుడు పత్రి భానుప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కానిస్టేబుల్‌పై దాడి..

# నలుగురి అరెస్ట్



**వీణవంక, నేటిధాత్రి:** విధి నిర్వహణలో ఉన్న పోలీసు కానిస్టేబుల్‌పై దాడి చేసి, సెల్‌ఫోన్ ధ్వంసం చేసి, బెదిరింపులకు పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అక్టోబరు 2న నర్సింగాపూర్ ఎస్సీ కాలనీ సమీపంలో బ్లూకోల్ట్స్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ గడ్డం అంజనేయులు బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని వీడియో తీసేందుకు ప్రయత్నించగా నిందితులు అడ్డుకున్నారు. ఆయన ఫోన్‌ను ధ్వంసం చేయడంతో పాటు మోటార్‌సైకిల్ కీ లాక్కొని చంపుతామని బెదిరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఊకంటి వేణు, ఊకంటి రుత్విక్, దాసారపు రామ్మోహన్, బోయిని అరవిందలను అక్టోబరు 14న అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆవుల తిరుపతి హెచ్చరించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోండి:

**▶▶ఫారం-18 ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం...**

**▶▶ఆర్డీవో డీఎస్ వెంకన్న....**



**పరకాల, నేటిధాత్రి:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పరకాల ఆర్డీవో డీఎస్ వెంకన్న సూచించారు. ఇందుకోసం ఫారం-18 ద్వారా ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫారం-18 దరఖాస్తులు పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం,తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, మున్సిపాలిటీ కార్యాలయం, మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఫారం-18ను పూర్తిచేసి, సంబంధిత కార్యాలయాల్లో 2026 నవంబర్ 6వ తేదీ (శుక్రవారం) లోపు సమర్పించాలని ఆర్డీవో డీఎస్ వెంకన్న కోరారు.

## దుర్గామాత మహా అన్నదాన కార్యక్రమానికి ఎస్పి కి ఆహ్వానం



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలం బస్వారాజు పల్లి గ్రామంలో దుర్గామాత ఉత్సవ కమిటీ నవరాత్రులలో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి మంటపం బస్టాండ్ వద్ద మహా అన్నదానా కార్యక్రమనికి ఏర్పాటు చేశారు ఈకార్యక్రమనికి ముఖ్య అతిదిగా భూపాలపల్లి జిల్లా సూపరెంటెంట్ అఫ్ పోలీస్ సిరిశెట్టి సంకీర్త్ ని ఆహ్వానించిన దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందించి ఎస్పి. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చింతకుంట్ల శ్రీనివాస్ పెంట కిరణ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## దేవీ నవరాత్రి ఉత్సవాల్లో డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు



**పరకాల, నేటిధాత్రి:** పరకాల పట్టణంలోని కనకదుర్గమ్మ-మదన పోచమ్మ తల్లి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. తదనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్,జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి మేఘనాథ్, కౌన్సిలర్ కుక్కల విజయ్, సాదా మధుకర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

**▶▶ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశం....**



**ఐనవోలు, నేటిధాత్రి:** రైతులతో ముచ్చటించి వారు సాగు చేస్తున్న పంటలు, సాగునీటి సరఫరా వివరాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అడిగి తెలుసుకున్నారు. ఐనవోలు మండలం వెంకటాపురంతో పాటు కడిపికొండ, కుమ్మరిగూడెం పరిసర ప్రాంతాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంటలకు నీటి కొరత ఉందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో



వెంటనే స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి దఫాల వారీగా సాగునీరు అందించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగుకు అవసరమైన సమయంలో నీరు అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

## గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల జాబితా విడుదల

**▶▶పరకాల నియోజకవర్గంలో నూతన నియామకాలు...**



**పరకాల, నేటిధాత్రి:** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ పరిధిలోని పరకాల మండలం,పరకాల పట్టణం,నడికుడ,ఆత్మకూరు,దామెర మండలాలకు సంబంధించి నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల జాబితాను విడుదల చేసినట్లు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సిఫార్సు,ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షుల సూచనల మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల ప్రకారం నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను అధికారికంగా నియమించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మార్గదర్శకత్వంలో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని నూతనంగా నియమితులైన అధ్యక్షులకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు.

## ఇమామ్‌లు, మౌజన్లకు రూ.22.45 కోట్ల గౌరవ వేతనం విడుదల

**▶▶9,982 మందికి మూడు నెలల చెల్లింపులు**

**▶▶ఇప్పటివరకు రూ.202 కోట్లు పంపిణీ**

**అమరావతి, నేటిధాత్రి:** ఆంధ్రప్రదేశ్‌లోని మసీదుల్లో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల గౌరవ వేతనాన్ని విడుదల చేసింది. మొత్తం 9,982 మందికి రూ.22.45 కోట్లను విడుదల చేసినట్లు ప్రకటించింది. వీరిలో 4,991 మంది ఇమామ్‌లు, మరో 4,991 మంది మౌజన్లు ఉన్నారు. నెలకు రూ.10 వేలు, రూ.5 వేలు మసీదుల్లో రోజువారీ ప్రార్థనా కార్యక్రమాలను నిర్వహించడంలో ఇమామ్‌లు, మౌజన్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా ఒక్కో ఇమామ్‌కు నెలకు రూ.10,000, ఒక్కో మౌజన్‌కు నెలకు రూ.5,000 చొప్పున చెల్లిస్తోంది. ఇప్పటివరకు రూ.202 కోట్లు గత 27 నెలల్లో ఇమామ్‌లు, మౌజన్లకు కలిపి మొత్తం రూ.202 కోట్ల గౌరవ వేతనాన్ని అందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. మతపరమైన సేవలందించే వారికి ఆర్థికంగా తోడ్పాటు అందించడంలో భాగంగా ఈ చెల్లింపులు చేపడుతున్నట్లు పేర్కొంది.

## జాతీయ రహదారి--65పై టీజీ సేఫ్ ప్రత్యేక ఆహార పరిరక్షణ తనిఖీలు.

**నల్గొండ, నేటిధాత్రి:** టీజీ సేఫ్ (తెలంగాణ స్టాండర్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎస్సెంటీ ఎసెన్షియల్ డ్రగ్స్ ) కమిషనర్ అవినాష్ మహంతి ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని జాతీయ రహదారి--65 నేషనల్ హైవే-65 పై గల పలు ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాల్లో ప్రత్యేక ఆహార పరిరక్షణ తనిఖీలను విస్తృతంగా నిర్వహించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో అక్టోబర్ 13న ఈ తనిఖీలు చేపట్టారు. మొత్తం 10 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఈ డ్రైవ్‌ను విజయవంతం చేశాయి. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని క్యూర్ ప్రాంతానికి చెందిన అధికారులు, పోలీసు సిబ్బందితో కలిపి సుమారు 60 మంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 20 ఆహార వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, నాణ్యత పరీక్షల నిమిత్తం 20 ఆహార నమూనాలను శాంపిల్స్ సేకరించారు. తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 7 సంస్థల ఆహార పరిరక్షణ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. కనీస లైసెన్స్ లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న 1 హోటల్‌ను పూర్తిగా మూసివేశారు . నిరంతర పర్యవేక్షణ మరియు మెరుగుదల కోసం 6 మెరుగుదల నోటీసులు, నిబంధనల ఉల్లంఘనలపై వివరణ కోరుతూ 6 షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాల వారీగా తీసుకున్న చర్యల వివరాలు



**నల్గొండ జిల్లా (మొత్తం తనిఖీలు: 10):**

తీవ్ర ఉల్లంఘనల కింద లైసెన్స్ సస్పెండ్ అయిన సంస్థలు: 2

లైసెన్స్ లేనందున పూర్తిగా మూసివేసిన సంస్థలు: 1

నిబంధనల ఉల్లంఘనలపై నోటీసులు అందుకున్న సంస్థలు: 7

సేకరించిన నమూనాలు: పప్పుధాన్యాలు, చికెన్ కర్రీ, టీ పొడి, జీడిపప్పు, పనీర్, వంటనూనె, సాస్‌లు.

**సూర్యాపేట జిల్లా (మొత్తం తనిఖీలు: 6):**

తీవ్ర ఉల్లంఘనల కింద లైసెన్స్ సస్పెండ్ అయిన సంస్థలు: 3

పరిశుభ్రత లోపాలపై సాధారణ నోటీసులు/తనిఖీలు జరిగిన సంస్థలు: 3

సేకరించిన నమూనాలు: పనీర్ మరియు సోయా సాస్ నమూనాలు.

**యాదాద్రి భువనగిరి జిల్లా (మొత్తం తనిఖీలు: 4):**

తీవ్ర ఉల్లంఘనల కింద లైసెన్స్ సస్పెండ్ అయిన సంస్థలు: 2

నిల్వ లోపాలు, FIFO/FEFO నిబంధనల ఉల్లంఘనలపై నోటీసులు అందుకున్నవి: 2

సేకరించిన నమూనాలు: ఎర్ర కందిపప్పు, టీ పొడి, అల్లం--వెల్లుల్లి పేస్ట్.

**తనిఖీల్లో గుర్తించిన ప్రధాన లోపాలు:**




తనిఖీల సందర్భంగా వంటకాల్లో పురుగుల ఉనికి, బొద్దింకలు ఉండడం, అపరిశుభ్రమైన రిఫ్రిజిరేటర్లు, ఫంగస్ పట్టిన కూరగాయలు, ఎలుకల విసర్జనలతో కలుషితమైన పదార్థాలు కనుగొన్నారు. శాకాహార-మాంసాహార పదార్థాలను కలిపి నిల్వ చేయడం, ఐస్ ముక్కలను పచ్చి మాంసంతో ఉంచడం, జిడ్డు పట్టిన ఎగ్జాస్టులు, డ్రైనేజీలో ఆహార వ్యర్థాలు వేయడం వంటి లోపాలను నమోదు చేశారు. కొన్ని సంస్థల్లో అనుమతించబడని సింథటిక్ ఆహార రంగులు, లేబులింగ్ లోపాలు, సిబ్బంది వైద్య ధ్రువపత్రాలు పురుగుల నియంత్రణ రికార్డులు లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యమని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీమతి జ్యోతిర్మయి తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాల నిర్వాహకులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఆహార పరిరక్షణ లైసెన్స్‌లను ప్రముఖంగా ప్రదర్శించాలని, వంటగదులు, నిల్వ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలపై తయారీ తేదీ, వినియోగ గడువు వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.

## ఉప్పరపల్లి సబ్ స్టేషన్ పనులు వేగవంతం...!

**▶▶అభివృద్ధి పనులను పరిశీలించిన మార్కెట్ చైర్మన్ సంజీవ రెడ్డి...**



**కేసముద్రం, నేటిధాత్రి:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం పనులను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యవేక్షక ఇంజనీరు దర్శన్ కుమార్, విభాగ ఇంజనీరు డి. కోటేశ్వరరావు ఉపకేంద్రం వద్దకు చేరుకొని నిర్మాణ పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, స్తంభాల నిర్మాణం, లైన్ల పనుల గురించి సహాయ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే కేసముద్రం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తొలగిపోయి, రైతులకు వ్యవసాయానికి, ప్రజలకు గృహ అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందుతుందని అధికారులు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గంటా సంజీవరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం నాగేశ్వరరావు, నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, బండారు దయాకర్ పాల్గొన్నారు. ఉపకేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. వారి వెంట సహాయ విభాగ ఇంజనీరు ఐలయ్య, నిర్మాణ విభాగ సహాయ ఇంజనీరు బి.వి. రమణ, నిర్వహణ విభాగ సహాయ ఇంజనీరు రాజు తదితరులు ఉన్నారు.

# ఆస్తుల జప్తు

**▶▶టీటీడీ కల్తీ నెయ్యి కేసులో కీలక మలుపు!**

**▶▶రూ.130 కోట్ల ఆస్తులను జప్తు చేసిన ఈడీ...**

**▶▶రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడి...**

**▶▶ఫ్రంట్ డెయిరీల ద్వారా టెండర్లలో పాల్గొన్నట్లు గుర్తింపు...**

**▶▶నకిలీ కొనుగోళ్లు, అమ్మకాలతో లావాదేవీలకు అసలు రూపం...**

**▶▶బ్యాంకు చెల్లింపుల అనంతరం హవాలా మార్గంలో నగదు మళ్లించినట్లు అనుమానం...**




**తిరుమల, నేటిధాత్రి:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సుమారు రూ.130 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు ప్రకటించింది. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భోలే బాబా డెయిరీ, శ్రీ వైష్ణవి డెయిరీ, సుకృతి ఫుడ్స్ సంస్థలకు సంబంధించిన ఆస్తులపై ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. రూ.234.5 కోట్ల సరఫరాపై దర్యాప్తు టీటీడీకి రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని ఈడీ తెలిపింది. టెండర్లలో నేరుగా పాల్గొనకుండా కొన్ని సంస్థలు ఇతర డెయిరీలను ముందుంచి సరఫరా వ్యవహారాన్ని కొనసాగించినట్లు గుర్తించామని పేర్కొంది. ఈ వ్యవహారంలో సంబంధిత సంస్థల పాత్ర, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపింది. నకిలీ లావాదేవీలతో మళ్లింపు కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించిన లావాదేవీలను నిజమైనవిగా చూపించేందుకు నకిలీ కొనుగోళ్లు, అమ్మకాల రికార్డులు సృష్టించినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించిందని సమాచారం. బ్యాంకుల ద్వారా చెల్లింపులు జరిపిన అనంతరం హవాలా మార్గంలో నగదును తిరిగి మళ్లించినట్లు అనుమానిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ లావాదేవీల వెనుక ఉన్న వ్యక్తులు, సంస్థల ఆర్థిక కార్యకలాపాలపై ఈడీ ఆరా తీస్తోంది. ప్రమోటర్ల ఆస్తులపైనా చర్యలు సంస్థల ప్రమోటర్లు విపిన్ జైన్, కైలాష్ చంద్ర మంగ్లా, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆస్తులపైనా దర్యాప్తు సంస్థ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఆస్తుల జప్తు ద్వారా అక్రమంగా సంపాదించినట్లు అనుమానిస్తున్న ఆస్తులను గుర్తించి, వాటి లావాదేవీలపై విచారణ కొనసాగిస్తున్నారు. టీటీడీ లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించిన నెయ్యి నాణ్యతపై మొదలైన వివాదం, సరఫరా సంస్థల ఆర్థిక లావాదేవీల దర్యాప్తుతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, దర్యాప్తులో వెల్లడైన ఆరోపణలు న్యాయస్థానంలో నిరూపితమయ్యే వరకు సంబంధిత వ్యక్తులు, సంస్థలపై నేరం రుజువైనట్లుగా భావించరాదు.



# నేటిధాత్రి 9
NETI DHATHRI

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు



# ఆహ్వానం

పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం" "శక్తి బ్రాడ్ కాస్టింగ్స్" ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.



## "నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
## విధంగానే "నేటిధాత్రి 9"
## "యూట్యూబ్ ఛానల్" కూడా
## ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# సరిహద్దు దాటితే సమరమే!

## ఉగ్రవాదంపై మారిన భారత్ వ్యూహం

●నిరసనల నుంచి సైనిక దాడుల దాకా..
దశాబ్దంలో నాలుగు కీలక మలుపులు
●మయన్మార్ నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు..
రక్షణ, దౌత్యం కలగలిపిన ప్రతిస్పందన



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ఉగ్రవాదం దాడి చేస్తే.. భారత్ ఇక మౌనంగా ఉండబోదన్న సంకేతం గత దశాబ్దంలో మరింత బలంగా వినిపిస్తోంది. ఒకప్పుడు దౌత్యపరమైన నిరసనలు, అంతర్జాతీయ ఒత్తిడికే ప్రధాన ప్రాధాన్యమిచ్చిన భారత్.. అవసరమైన సందర్భాల్లో సరిహద్దులు దాటి సైనిక చర్యలు చేపట్టే దిశగా తన వ్యూహాన్ని విస్తరించింది. 2015లో మయన్మార్ ఆపరేషన్‌తో మొదలైన ఈ మార్పు.. 2016లో సర్జికల్ దాడులు, 2019లో బాలాకోట్ వైమానిక దాడి, 2025లో ఆపరేషన్ సిందూర్‌తో మరో స్థాయికి చేరింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో సైనిక సామర్థ్యంతో పాటు దౌత్య, వ్యూహాత్మక మార్గాలను సమన్వయం చేసుకోవడమే భారత్ విధానంలో కనిపిస్తున్న ప్రధాన పరిణామం.

### మయన్మార్‌తో మొదలైన మార్పు

2015 జూన్‌లో మణిపూర్‌లోని చాండెల్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో 18 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు ప్రతిస్పందనగా జూన్ 9న భారత ప్రత్యేక దళాలు మయన్మార్ సరిహద్దు సమీపంలోని ఉగ్రవాద శిబిరాలపై చర్యలు చేపట్టాయి. ఈ ఆపరేషన్ ద్వారా సరిహద్దు అవతల నుంచి ఎదురయ్యే ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉందనే సందేశం వెలువడింది. ఉగ్రవాద దాడులపై కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా కార్యాచరణకు దిగే విధానానికి ఇది ఆరంభ సంకేతంగా నిలిచింది.

### ఉరీ దాడి.. సర్జికల్ స్ట్రైక్స్

2016 సెప్టెంబర్‌లో ఉరీలోని సైనిక శిబిరంపై జరిగిన దాడిలో 19 మంది సైనికులు మరణించడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. దీనికి ప్రతిస్పందనగా సెప్టెంబర్ 28–29 రాత్రి భారత ప్రత్యేక దళాలు నియంత్రణ రేఖ దాటి ఉగ్రవాదుల లాంచ్‌ప్యాడ్లపై దాడులు నిర్వహించాయి. మరుసటి రోజు సైనిక అధికారులు ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. సరిహద్దు అవతల ఉగ్రవాద మౌలిక వసతులపై లక్షిత దాడులు చేయగలమని భారత్ ప్రకటించడం వ్యూహాత్మకంగా కీలక పరిణామమైంది.
అయితే ఈ ఆపరేషన్ అనంతరం దాడుల ఆధారాలు, జరిగిన నష్టం, ఫలితాలపై రాజకీయ చర్చ కూడా సాగింది. అయినప్పటికీ, ఉగ్రవాద దాడికి సైనిక చర్యతో సమాధానం ఇచ్చే విధానంలో సర్జికల్ స్ట్రైక్స్ ఒక ముఖ్యమైన మలుపుగా నిలిచాయి.

### బాలాకోట్‌తో మరో అడుగు

2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మరణించారు. ఈ ఘటనకు ప్రతిస్పందనగా ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం పాకిస్థాన్‌లోని బాలాకోట్ ప్రాంతంలో వైమానిక దాడి నిర్వహించింది. జైషే మహ్మద్ శిక్షణ కేంద్రంగా భారత్ పేర్కొన్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుంది.
2016లో భూతల దళాలు నియంత్రణ రేఖ దాటి నిర్వహించిన దాడులతో పోలిస్తే.. బాలాకోట్ చర్య వైమానిక శక్తిని వినియోగించిన ఆపరేషన్‌గా ప్రత్యేకత సంతరించుకుంది. ఉగ్రవాద ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ సైనిక చర్యల పరిధిని విస్తరించగలదనే సంకేతం వెలువడింది. దాడి ప్రభావం, నష్టం వంటి అంశాలపై రాజకీయ వాదోపవాదాలు జరిగినప్పటికీ, ఉగ్రవాదానికి ప్రతిస్పందించే విధానంలో ఇది మరో కీలక ఘట్టంగా నిలిచింది.

### సిందూర్‌తో బహుముఖ వ్యూహం

2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పౌరులు మరణించడం దేశాన్ని కలచివేసింది. ఈ ఘటనకు ప్రతిస్పందనగా మే 7న భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జైషే మహ్మద్‌కు చెందిన బహావల్‌పూర్, లష్కరే తోయిబాకు చెందిన మురీద్కే కేంద్రాలు సహా పలు ప్రాంతాలపై దాడులు నిర్వహించినట్లు వెల్లడించింది.
ప్రారంభ దశలో ఉగ్రవాద స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని భారత్ పేర్కొంది. అనంతరం పాకిస్థాన్ సైనిక ప్రతిస్పందన నేపథ్యంలో సైనిక స్థావరాలపై కూడా చర్యలు చేపట్టినట్లు తెలిపింది. దీంతో ఆపరేషన్ సిందూర్ కేవలం లక్షిత దాడులకే పరిమితం కాకుండా, పరిస్థితులకు అనుగుణంగా విస్తరించిన బహుముఖ సైనిక చర్యగా మారింది.

### సైనిక చర్యకు తోడు దౌత్య ఒత్తిడి

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ సైనిక చర్యతో పాటు దౌత్యపరమైన నిర్ణయాలకూ ప్రాధాన్యమిచ్చింది. సింధు జల ఒప్పందాన్ని నిలిపివేసే నిర్ణయం ద్వారా పాకిస్థాన్‌పై వ్యూహాత్మక ఒత్తిడి పెంచే ప్రయత్నం చేసింది. అనంతరం పలు దేశాలకు అఖిలపక్ష ప్రతినిధి బృందాలను పంపి ఉగ్రవాదంపై తన వైఖరిని అంతర్జాతీయ సమాజానికి వివరించింది.
ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే వ్యవస్థలను ఉపేక్షించబోమని, అణు బెదిరింపులకు వెనక్కి తగ్గబోమని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్‌ను ముగించామని కాకుండా తాత్కాలికంగా నిలిపివేశామని పేర్కొనడం ద్వారా భవిష్యత్తు పరిణామాలకు అనుగుణంగా చర్యలు చేపట్టే అవకాశాన్ని ఉంచింది.

### తగ్గిన ఘటనలు.. పెరిగిన ప్రతిస్పందన సామర్థ్యం

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విధానంలో మార్పుతో పాటు



దేశంలో హింసాత్మక ఘటనలు తగ్గాయని కేంద్ర ప్రభుత్వం గణాంకాలను ప్రస్తావిస్తోంది. 2004–2014 మధ్య దేశంలో 7,217 ఉగ్రవాద ఘటనలు నమోదుకాగా, 2014–2024 మధ్య 2,242 ఘటనలు నమోదైనట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో వెల్లడించిన గణాంకాలు పేర్కొంటున్నాయి. మొత్తం మరణాలు 70 శాతం, పౌరుల మరణాలు 81 శాతం, భద్రతా సిబ్బంది మరణాలు 50 శాతం తగ్గినట్లు ప్రభుత్వం తెలిపింది.
జమ్మూ కశ్మీర్‌లోనూ 2004–2014 మధ్య 1,769 మంది పౌరులు ఉగ్రవాద హింసలో మరణించగా, 2014–2024 మధ్య ఈ సంఖ్య 344కు తగ్గినట్లు కేంద్రం పేర్కొంది. హింసాత్మక ఘటనలు 16,463 నుంచి 7,744కు తగ్గినట్లు తెలిపింది. అయితే ఈ గణాంకాలతో పాటు ఉగ్రవాద ముప్పు స్వరూపం, భద్రతా వ్యవస్థల సామర్థ్యం, సరిహద్దు పరిస్థితులు, స్థానిక పరిణామాలను కూడా సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### ముందున్న సవాళ్లు

మయన్మార్ ఆపరేషన్ నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు సాగిన పరిణామాలను పరిశీలిస్తే.. భారత్ ప్రతిస్పందనలో సైనిక చర్యల పరిధి, లక్ష్యాల స్వరూపం, దౌత్య సమన్వయం విస్తరించాయి. అయితే ఈ వ్యూహాన్ని దీర్ఘకాలికంగా సమర్థంగా కొనసాగించాలంటే ఆధునిక ఆయుధ వ్యవస్థలు, వైమానిక రక్షణ, నిఘా సామర్థ్యాలు, ఖచ్చితమైన దాడులు, మూడు సైనిక విభాగాల మధ్య సమన్వయం మరింత కీలకం కానున్నాయి.
అదే సమయంలో అంతర్జాతీయ మద్దతు సాధించడం, ఉద్రిక్తతలు విస్తరించకుండా చూడడం, పౌరుల ప్రాణనష్టాన్ని నివారించడం కూడా అంతే ముఖ్యం. సైనిక విజయం ఒక్కటే ఉగ్రవాద సమస్యకు సంపూర్ణ పరిష్కారం కాదు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను అడ్డుకోవడం, నిధుల ప్రవాహాన్ని నిలువరించడం, నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం కూడా అవసరమే.
మొత్తంగా.. గత దశాబ్దంలో భారత్ ఉగ్రవాద వ్యతిరేక వ్యూహం నిరసనల నుంచి ప్రత్యక్ష చర్యల వైపు, అక్కడి నుంచి సైనిక–దౌత్య సమన్వయం వైపు పరిణామం చెందింది. 2015 మయన్మార్ ఆపరేషన్, 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ దాడి, 2025 ఆపరేషన్ సిందూర్ ఈ మార్పులో నాలుగు కీలక మైలురాళ్లుగా నిలిచాయి. భవిష్యత్తులో ఈ వ్యూహం ఎంత సమర్థంగా పనిచేస్తుందన్నది.. ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంతో పాటు దేశ భద్రతను కాపాడటం, ప్రాంతీయ స్థిరత్వాన్ని నిలబెట్టడం, అవసరమైన సందర్భాల్లో నిర్ణయాత్మకంగా వ్యవహరించడం మధ్య భారత్ సాధించే సమతౌల్యంపై ఆధారపడి ఉంటుంది.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీపై రామకృష్ణ ఆశలు!

●సీఎం రేవంత్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డిపై పూర్తి విశ్వాసం
●విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ కోసం పనిచేశా.. సేవలకు గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి



●ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌కు వినతి

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి సచిన్ సావంత్‌ను కలిసి తన అభ్యర్థనను వివరించారు. విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐ నుంచి ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానం, కాంగ్రెస్ పార్టీ కోసం చేసిన సేవలు, వివిధ ప్రజాసంఘాలతో కలిసి చేపట్టిన కార్యక్రమాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. తన రాజకీయ అనుభవం, పార్టీకి అందించిన సేవలతో కూడిన వివరాలను కేసీ వేణుగోపాల్‌కు అందజేసి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### అధిష్టానంపై సంపూర్ణ విశ్వాసం

కాంగ్రెస్ అధిష్టానంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకుల సేవలను నాయకత్వం గుర్తిస్తుందనే నమ్మకం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిపై తనకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం, పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

### పదవి కాదు.. ప్రజాసేవే లక్ష్యం

ఎమ్మెల్సీగా అవకాశం లభిస్తే ప్రజలకు మరింత విస్తృతంగా సేవ చేసే అవకాశం ఉంటుందని రామకృష్ణ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు పేదలు, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలన్నది తన ఆకాంక్షగా పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసే నాయకులకు సముచిత గుర్తింపు లభిస్తే కార్యకర్తల్లోనూ ఉత్సాహం పెరుగుతుందని అన్నారు.

### నిర్ణయంపై ఆశాభావం

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవికి సంబంధించి పార్టీ ముఖ్య నేతలను కలిసి తన అభ్యర్థనను వివరించిన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయంపై రామకృష్ణ ఆశలు పెట్టుకున్నారు. విద్యార్థి దశ నుంచి పార్టీతో కొనసాగుతున్న అనుబంధం,రాజకీయ అనుభవం, ప్రజా సమస్యలపై చేపట్టిన కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని అవకాశం కల్పిస్తారని విశ్వసిస్తున్నారు. ఎమ్మెల్సీ పదవి లభిస్తే ప్రజాసేవను మరింత విస్తృతం చేయాలన్న సంకల్పంతో ఉన్నారు.

# 22 ఏళ్ల సేవకు ఇదేనా గౌరవం?

●మూడు నెలలుగా మెసెంజర్లకు జీతాల కరువు!
●ఏజెన్సీ విధానంతో వేతనాల చెల్లింపులో జాప్యం





●సమగ్ర శిక్ష అభియాన్ నుంచే నేరుగా జీతాలు చెల్లించాలి: టీపీటీఎఫ్ డిమాండ్
●టి పి టి ఎఫ్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ డిమాండ్
●మిగతా సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగస్తుల వలెనే వీరికి కూడా సర్వ శిక్ష అభియాన్ నుండే నేరుగా వేతనాలు చెల్లించాలి
●ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి సమగ్ర శిక్ష అభియాన్ నుంచే నేరుగా వేతనాలు చెల్లించాలి- ప్రధాన కార్యదర్శి నర్సింహారాజు

కేసముద్రం, నేటిధాత్రి:
మహబూబాబాద్ జిల్లాలోని పది మండలాల మండల విద్యా వనరుల కేంద్రాల్లో పనిచేస్తున్న మెసెంజర్లకు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంపై టీపీటీఎఫ్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షుడు గుండు సురేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇతర సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగానే మెసెంజర్లకు కూడా నేరుగా వేతనాలు అందించాలని కోరారు.

### ఏజెన్సీలతోనే అసలు సమస్య

జిల్లాలోని పది మండలాల్లో మెసెంజర్లు కొన్నేళ్లుగా ఏజెన్సీల ద్వారా వేతనాలు పొందుతున్నారని గుండు సురేందర్ తెలిపారు. ఈ విధానం వల్ల జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత ఏజెన్సీల మధ్య సమన్వయ లోపం కారణంగా ఉద్యోగులు సకాలంలో వేతనాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. బడ్జెట్ విడుదల కాలేదనే కారణంతో మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల మెసెంజర్లు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### పండుగల వేళా తప్పని ఇబ్బందులు

ఇప్పటికే చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న మెసెంజర్లకు పండుగల సమయంలోనూ జీతాలు అందకపోవడం బాధాకరమని సురేందర్ అన్నారు. విధులను బాధ్యతగా నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు రావాల్సిన వేతనాలను సకాలంలో చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. 22 ఏళ్లుగా సేవలందిస్తున్న మెసెంజర్లకు సకాలంలో జీతాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

### నేరుగా వేతనాలు చెల్లించాలి

ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి సమగ్ర శిక్ష అభియాన్ నుంచే మెసెంజర్లకు నేరుగా వేతనాలు చెల్లించాలని టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నర్సింహారాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాల చెల్లింపులో జాప్యానికి శాశ్వత పరిష్కారం చూపి ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.

# గద్వాలలో హరీశ్ రావు 'రైతు గర్జన'!



గద్వాల, నేటిధాత్రి:
జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు పర్యటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రైతులకు విద్యుత్ సరఫరాలో కోతలు, ఎండిపోతున్న పంటలు, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత, ఉపాధ్యాయుల కొరత, పేద దళిత రైతుల భూముల సమస్యలను ఆయన ప్రస్తావించారు. గట్టు విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి లాగ్‌బుక్ పరిశీలించగా, ఇందువాసిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వలసకూలీల కుటుంబాలను పరామర్శించారు. పాఠశాల విద్యార్థుల సమస్యలను విన్నారు. రాయపురం రైతుల భూముల పోరాటానికి మద్దతు ప్రకటించారు.

### లాగ్‌బుక్‌లో 7.50 గంటలే!

గట్టు మండలంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని రైతులు ఫిర్యాదు చేయడంతో హరీశ్ రావు విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారిక లాగ్‌బుక్‌ను పరిశీలించి, అక్టోబరు 13న రైతులకు అందించిన త్రీఫేస్ విద్యుత్ సరఫరా వివరాలను వెల్లడించారు. ఆ రోజు మొత్తం 7 గంటల 50 నిమిషాలే విద్యుత్ సరఫరా జరిగిందని తెలిపారు. అందులోనూ మూడుసార్లు అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు.
ఒకసారి గంటపాటు, మరోసారి ఐదు నిమిషాలు, ఇంకోసారి పది నిమిషాలపాటు సరఫరా నిలిచిపోయిందని వివరించారు. రైతులకు కనీసం ఎనిమిది గంటల విద్యుత్ కూడా నిరంతరాయంగా అందించలేకపోతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఇచ్చే కొద్దిపాటి సమయంలోనూ పదేపదే కోతలు విధించడం వల్ల సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.

### చివరి మడికి అందని నీరు

విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోవడంతో బోర్ల నుంచి నీరు సక్రమంగా పారడం లేదని, మొదటి మడులకే నీరు అందుతుండగా చివరి మడులకు నీరు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు హరీశ్ రావు తెలిపారు. ఫలితంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.
సబ్‌స్టేషన్ సిబ్బందిని లాగ్‌బుక్ వివరాలపై ప్రశ్నించగా, ఉన్నతాధికారుల నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేయాలంటూ సందేశాలు వస్తాయని, వాటి ప్రకారం తాము వ్యవహరిస్తామని సిబ్బంది తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే ఈ వాదనలను స్వతంత్రంగా నిర్ధారించే ఆధారాలు అందుబాటులో లేవు.
కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం రైతులకు సరిపడా విద్యుత్ ఇవ్వడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. హైదరాబాద్, ఐటీ సంస్థలు, పెద్ద పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

### వలసకూలీల కుటుంబాలకు అండ

గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన వలసకూలీలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబాలను హరీశ్ రావు పరామర్శించారు. మృతులు ఏసేపు, నాగన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆర్థిక సాయం అందించారు. ప్రమాదంలో గాయపడిన వారిని కూడా పరామర్శించి, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.
కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాలో జరిగిన ప్రమాదంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వలసకూలీలు ప్రాణాలు కోల్పోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల పరిహారం అందించాలని, క్షతగాత్రులకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించి ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు తగిన సహాయం అందించడంలో ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించడం లేదని విమర్శించారు.
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ తరఫున తక్షణ ఆర్థిక సాయం అందించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. హరీశ్ రావు వెంట మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంతు నాయుడు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### 'పురుగుల అన్నం పెడుతున్నారు'

ఇందువాసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు హరీశ్ రావు కాన్వాయ్‌ను ఆపి తమ సమస్యలను వివరించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాసిరకం అన్నం, పురుగులున్న ఆహారం పెడుతున్నారని ఆరోపించారు. ప్రతిరోజూ వంకాయ కూరే వడ్డిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక చదువులకు ఆటంకం కలుగుతోందని, కనీస వసతులు కూడా అందుబాటులో లేవని విద్యార్థులు తెలిపారు. ఈ పరిస్థితుల కారణంగా చదువుపై ఆసక్తి తగ్గి, మధ్యలోనే బడి మానేసే వారి సంఖ్య పెరుగుతోందని వాపోయారు.
గ్రామంలో నెలకొన్న కరువు పరిస్థితుల వల్ల కుటుంబాలకు ఉపాధి దొరకడం లేదని, తల్లిదండ్రులతో కలిసి కూలీ పనుల కోసం



వలస వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు హరీశ్ రావు దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను ఓపికగా విన్న ఆయన, పాఠశాల పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### 110 ఎకరాల భూములపై వివాదం

గట్టు మండలం రాయపురంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం పేద దళిత రైతులకు చెందిన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలన్న ప్రయత్నాలపై హరీశ్ రావు స్పందించారు. భూముల పరిరక్షణ కోసం రైతులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.
గ్రామంలో తరతరాలుగా సాగు చేసుకుంటున్న 110 ఎకరాల అసైన్డ్ భూములు తమ జీవనాధారమని రైతులు ఆయనకు వివరించారు. తమ భూములకు సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులు ఉన్నాయని, రైతుబంధు సాయం పొందుతూ, పంట రుణాలు తీసుకుని వరి, శనగ పంటలు సాగు చేస్తున్నామని తెలిపారు. తొలుత 50 ఎకరాలు మాత్రమే తీసుకుంటామని చెప్పి, ఇప్పుడు మొత్తం 110 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.
ఎంత పరిహారం ఇచ్చినా తమ జీవనాధారమైన భూములను వదులుకోలేమని రైతులు స్పష్టం చేసినట్లు తెలిపారు. వారి ఆవేదనను విన్న హరీశ్ రావు, పేద దళిత రైతుల భూములను బలవంతంగా తీసుకోవడం సరికాదని అన్నారు. రైతులు అధైర్యపడవద్దని, భూముల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైతే ప్రజాక్షేత్రంలోనూ, శాసనసభలోనూ ప్రభుత్వాన్ని నిలదీసి రైతుల భూములను కాపాడేందుకు పోరాడతామని ప్రకటించారు.

### ఒకే పర్యటనలో నాలుగు అంశాలు

గద్వాల జిల్లా పర్యటనలో హరీశ్ రావు రైతులకు విద్యుత్ సరఫరా, వలసకూలీల కుటుంబాల కష్టాలు, ప్రభుత్వ పాఠశాలల సమస్యలు, దళిత రైతుల భూముల వివాదాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఆయా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, బాధితులకు అండగా ఉంటామని ప్రకటించారు. విద్యుత్ సరఫరా, పాఠశాలల నిర్వహణ, భూముల వ్యవహారాలపై సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఈ పర్యటనలో ప్రస్తావించిన అంశాలు సూచిస్తున్నాయి.

# ఏకశిల ఆసుపత్రిలో రవీందర్‌కు ఎమ్మెల్యే నాగరాజు పరామర్శ

## మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన

హన్మకొండ, నేటిధాత్రి:
హన్మకొండలోని ఏకశిల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరకుడు రవీందర్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్‌రాజ్ పరామర్శించారు. రవీందర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.
రవీందర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే నాగరాజు, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అండగా



ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజలకు, పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, కల్లెడ సొసైటీ చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు, చౌటపల్లి సొసైటీ చైర్మన్ పత్తి కుమారస్వామి, వడ్లకొండ సర్పంచ్ అభ్యర్థి అనిల్, మండల మహిళా అధ్యక్షురాలు సువార్త, సొసైటీ డైరెక్టర్లు బొట్ల మహేంద్ర, అబర్ల రవి, నాయకులు చౌడ సుధాకర్, ప్రమోద్, సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999